క్లుప్తంగా

శ్రీరంగాపురం ఎస్‌ఐగా హిమబిందు



వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం మండలం ఎస్‌ఐగా హిమబిందు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవరించరాదని శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిమబిందు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో 2వ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ శ్రీ రంగాపురం కు బదీలీ పై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆమే కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



ఆత్మకూర్: విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సోచట్టం, బాల్యవివాహాల నిర్మూలన, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొండాపురం బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయి భీమన్నకు నివాళి

వనపర్తిటౌన్: ఉపాధ్యాయుడిగా, సంఘ సంస్కకర్తగా సామాజిక చైతన్యాన్ని రగిలించే రచనలు చేసిన అభ్యుదయ వాది బోయి భీమన్న అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బోయి భీమన్న జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కవలు గిరిరాజాచారి, కుర్మయ్య, యూటీఎఫ్ నాయకుడు వెంకటేష్, రమేష్‌చారి పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

గోపాల్‌పేట: ప్రభుత్వ నుంచి వచ్చే సబ్సిడీ వస్తువులను రైతులు వినియోగించుకోవాలని ఏఓ కరుణశ్రీ కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. రోటవేటర్స్, కల్టివేటర్స్, ఎంబిప్లవ్, కేజీవీల్స్ తదితర 57 వస్తువులు ఉన్నాయన్నారు. రైతుల పేరుమీద వాహన ఆర్సీ తప్పకుండా ఉండాలన్నారు. వీటికి సంబంధించిన పత్రాలు అప్లికేషన్ ఫాం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పట్టాదారు పాస్‌బుక్, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్సు తీసుకుని సంబంధిత రైతువేదికలో ఏఈఓ లేదా ఏఓను కలిసి పత్రాలు సమర్పించాలని కోరారు.

క్రీడా పోటీలతో నైపుణ్యాల్లో మెరుగు



వీపనగండ్ల: పాఠశాల స్థాయిలో క్రీడలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ఎంతో ఉపయోగపడుతాయని ఎంఈఓ నర్సింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పాఠశాలల స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఇండియా క్రీడల కోసం మండలంలోని 8 ఉన్నత పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, కోకో పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం భానుప్రకాష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

ఆత్మకూర్: పవిత్ర మక్కా, మదీన ఉమ్రా యాత్రకు వెళ్తున్న యాత్రికులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక మదర్సా ఇమాదుల్‌ఉలూం మస్జీద్‌లో హఫీజ్ జియా ఉర్ రహ్మాన్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్రకు వెళ్తున్న మెకానిక్ ముజీబుర్‌రహ్మాన్, అబ్దుల్ రహ్మాన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాజులజబ్బార్, మహ్మద్, మహ్మద్‌కౌసర్, నజీర్, సిరాజ్ అహ్మద్, షేఖ్అలీ, అహ్మద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం



శిథిల భవనంతో కొనసాగుతున్న మండల మహిళా సమాఖ్య కార్యాలయం

- శిథిలావస్థలో మహిళా సమాఖ్య భవనం
- నిధులు మంజూరై వెనక్కి వెళ్లిన వైనం
- కనీస వసతులు లేక ఇబ్బందులు
- స్పందించని అధికారులు

వీపనగండ్ల: మహిళా సాధికారిత కోసం రూ.లక్షలతో ఖర్చు చేస్తున్నామని చెబుతున్న పాలకులు, అధికారులు మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం శిథిలావస్థకు చేరినా పట్టించుకోవడంలేదన్నారు. మహిళాసంఘం సభ్యులు కనీస వసతులకు నోచుకోక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరైన భవన నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో పలుమార్లు వచ్చిన నిధులు వెనక్కి వెళ్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాన్ని చేపట్టి మహిళా సంఘం సభ్యులకు మెరుగైన వసతులు కల్పించాలని మండలంలోని వివిధ గ్రామాల సంఘం సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

463 సంఘాలు 5,094 మంది సభ్యులు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 463 మహిళా సంఘాలు ఉండగా వాటిలో 5,094 మంది సభ్యులు ఉండి సమాఖ్య కార్యాలయంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించుకొని ఆర్థికంగా బలపడేందుకు అవసరమైన సూచనలు అధికారుల నుంచి తీసుకుంటూ ఉంటారు. బొల్లారం గ్రామంలో 55 సంఘాలు 567 మంది సభ్యులు, గోపల్‌దిన్నెలో 31 సంఘాలు 350 మంది, గోవర్ధనగిరిలో 33 సంఘాలు 349మంది, సంపత్‌రావుపల్లిలో 22సంఘాలు 258మంది, సంగినేనిపల్లిలో 45 సంఘాలు 459 మంది, కల్వరాల్లలో 65 సంఘాలు 748 మంది, నాగర్లబండతాండాలో 11 సంఘాలు 111 మంది, కొర్లకుంటలో 10 సంఘాలు 109 మంది, పుర్గర్‌చర్లలో 32 సంఘాలు 347 మంది, రంగవరంలో 10 సంఘాలు 107 మంది, తూముకుంటలో 53 సంఘాలు 546 మంది, వల్లభాపురంలో 15 సంఘాలు 159 మంది, వల్లాభాపురంతండాలో 13 సంఘాలు 169మంది, వీపనగండ్లలో 68సంఘాలు 815 సభ్యులు ఉన్నారు.



భవన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

శిథిల భవనంతో అవస్థలు

సమాఖ్య కార్యాలయ భవన నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.13లక్షలు ఖర్చుచేసి భవనాన్ని నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత 2012 సంవత్సరంలో రూ.23లక్షలు మంజూరు చేసి ఆనాటి రాష్ట్ర మంత్రి డీకే అరుణ చేత ఆర్భాటంగా శిలాఫలకాన్ని వేయించారు. కాని నేటికీ భవన నిర్మాణానికి పూనుకోకపోవడంతో మహిళాసంఘం సభ్యులు నిరాశకు గురవుతున్నారు. అరకొర వసతులతో కొనసాగుతున్న భవనంలో కార్యాలయ వస్తువులు, నెలవారి సమావేశాలు ఏర్పాటు చేస్తున్న మహిళలకు సరైన వసతులు లేవు.

మెరుగైన వసతులు కల్పించాలి



సమాఖ్య కార్యాలయానికి వెళ్లే మహిళలకు కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. భవన నిర్మాణానికి నిధులు మంజూరవుతున్నాయని చెబుతున్నా రు తప్పా కానీ నిర్మించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

– శాంతమ్మ,
మహిళా సమాఖ్య సభ్యురాలు, పుర్గర్‌చర్ల

ప్రత్యేక నిధులు కేటాయించాలి



మార్కెట్‌రేట్లకు అనుగుణంగా నిధులు మంజూరు చేయకపోవడం వల్లే నూతన భవనాన్ని నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు కేటాయించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలి.

– ఎత్తం చిట్టెమ్మ,
జిల్లా మహిళా సమాఖ్య కోశాధికారి, వీపనగండ్ల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



సమాఖ్య కార్యాలయ నూతన భవనాన్ని నిర్మిస్తే మహిళా సంఘం సభ్యులకు కార్యాలయ సిబ్బందికి మెరుగైన వసతులు లభిస్తాయి. భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ ఉన్నతస్థాయి అధికారులకు త్వరలో నివేదికలను అందజేస్తాం.

– ఏపీఎం,
మద్దిలేటి, వీపనగండ్ల

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి గ్రామపంచాయతీ సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా పండుగ రోజున కార్మికులను పస్తులుంచకుండా వెంటనే వేతనాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా పంచాయతీ సిబ్బంది వేతనాలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్ విధానం వలన ప్రమాదాలు జరిగి మరణిస్తున్న కార్మికులకు రూ.20 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని, జీవో నం.51 సవరణ చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షలు చెల్లించడంతో పాటు బీమా, ఈఎస్‌ఐ, పీఎఫ్, బోనస్ వంటి సౌకర్యాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటేశ్, కృష్ణయ్య, లలితమ్మ, కురుమమ్మ పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన ఎమ్మెల్యే



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

కొత్తకోట రూరల్: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం మంత్రి చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రితో మాట్లాడుతూ.. కొత్తకోట పట్టణంలో ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. దేవరకద్ర నియోజవర్గంలోని మదనాపురం, అడ్డాకల్, మక్తల్ నియోజవర్గంలోని అమరచింత, ఆత్మకూర్ మండలాలకు చెందిన ఎస్సీ విద్యార్థులు విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కొత్తకోట పట్టణంలో ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలపై నిరంతరం మంత్రులను కలిసి అభివృద్ధికోసం నిధులు తీసుకురావడంతో పాటు హాస్టల్స్ కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మ.దుసూదన్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్‌జే.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, బీచుపల్లి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

'అంగన్‌వాడీ టీచర్ల అక్రమ అరెస్టు తగదు'

మదనాపురం: అంగన్‌వాడీ టీచర్లను అక్రమ అరెస్టు చేయడం తగదని అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఘటనపై ఆమె స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ హక్కుల కోసం డిమాండ్ సాధనకోసం ఆందోళన చేయడం టీచర్ల హక్కు అన్నారు. అలాంటి సమయంలో అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. టీచర్ల సమస్యలను వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు.



మదనాపురం అంగన్‌వాడీ టీచర్లను అరెస్టు చేసిన పోలీసులు

ఆత్మకూర్: విధుల్లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు వేధింపులకు గురిచేస్తూ అక్రమంగా అరెస్టులు చేయడం వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ రమేష్, సీపీఎం మండల అధ్యక్షుడు రాజు అన్నారు. శుక్రవారం అమరచింత, ఆత్మకూర్, మదనాపురం మండలాల్లో విధుల్లో ఉన్న అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూ పోలీసుల తీరును తప్పుబట్టారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: పట్టణ సమస్యలు పరిష్కరించాలని పెబ్బేరు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. భగీరథ వాటర్ రావడం లేదని, 9 వాటర్ ఫిల్టర్లు ఉండగా అందులో రెండు మాత్రమే పనిచేస్తున్నాయని, మిగతా 7వాటర్ ఫిల్టర్లను రిపేరు చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెబ్బేరు–వనపర్తి రోడ్డు విస్తరణలో 140 ఇళ్లను తొలగించారని, ఇంకా రెండు ఇళ్లను తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ బెడ్రూం కాలనీలో చెత్తచెదారం తొలగించి వాటర్‌ప్లాంట్ నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ నాయకులు విశ్వరూపం, పార్వతి, శంకర్‌నాయుడు, శివశంకర్‌గౌడ్, ఎండీ మజీద్, బీచుపల్లి, శేఖర్‌గౌడ్, ఎల్లయ్య, సాయిరెడ్డి, శాంతన్న, వీరబోజచారి పాల్గొన్నారు.

22న చలో హైదరాబాద్

అమరచింత: ఈనెల 22న కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధ్యక్షుడు రాజు తెలిపారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం సందర్శించి నాన్ టీచింగ్ స్టాఫ్ కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాల పెంపు, పనిభారం తగ్గింపు, ఖాళీ పోస్టుల భర్తీ చేయాలనే ప్రధాన డిమాండ్‌లలో ఎస్‌పీడీ కార్యలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సునీత, శోభ, విమల, తాహెరా, హబిబా తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వనపర్తిటౌన్: గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది ప్రశ్నించారు. ఈ మేరకు హాస్టల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహం విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో పని చేస్తున్న డైలీవైజ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించి, కార్మికులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు వేతనాలు పెంచాలని 8 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం వారి సమస్యలు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్న నాయక్, ఈశ్వర్, మనోజ్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

హీరో గ్లామర్ ఎక్స్ ఆవిష్కరణ



కొత్తకోట: హీరో మోటర్ కార్ప్ నూతనంగా సరికొత్త హంగులతో ప్రవేశపెట్టిన హీరో గ్లామర్ ఎక్స్ 125 సీసీ ద్విచక్ర వాహనాన్ని పట్టణంలోని పద్మావతి హీరో షోరూంలో శుక్రవారం కొత్తకోట టూ వీలర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు మేఘారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హీరో కంపెనీ సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ద్విచక్ర వాహనాలను ప్రవేశపెట్టడంతో పాటు, ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని పొందుపరుస్తు టూ విలర్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో షోరూం యజమాని రవికుమార్, సిబ్బంది జగన్, కార్తిక్, సాయి, పల్లవి, సంధ్య, మీనాక్షి, లక్ష్మి, టెక్నీషియన్స్ మన్యం, మోహన్‌గౌడ్, విజయ్ ఖదీర్, అమార్, ఫిరోజ్, హాజీ, శ్రీకాంత్, రాజు, కిషోర్, శేఖర్, గణేష్, అనిల్, అంజి, మహేష్, ఫైనాన్స్ సభ్యులు విజయ్, వెంకటేష్, శ్రీకాంత్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన గుంపల్లి రాములు కుమారుడు వంశీ (24), దొంతికుంట తండాకు చెందిన గోపి భార్య సక్రి (26) గురువారం భూత్పూర్ మండలం కొత్త మొల్గర సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు వారిని కలిసి నేత్ర దానం చేయాలని కోరారు. తమ వారు చనిపోయిన వేరొకరికి చూపును ఇస్తున్నందుకు సంతోషిస్తూ అందుకు మృతుల కుటుంబసభ్యులు అంగీకరించారు. వెంటనే మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి నేత్ర దానం చేయించి అక్కడి నుంచి వెంటనే హైదరాబాద్ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు మధు తెలిపారు. నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చిన మృతుల కుటుంబ సభ్యులు ఆయాగ్రామాల పెద్దలను మధుతో పాటుగా పలువురు అభినందించారు.



ధ్రువీకరణ పత్రం ఇస్తున్న వైద్యులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సహకరించాలని ఎస్‌ఐ కే రాణి, ఏఎస్‌ఐ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో రైతు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజా సంఘాలు, గ్రామస్తులు తమ వంతు సహకారాన్ని అందిస్తే గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి

పాన్‌గల్: ఓటరు జాబితాలో చనిపోయిన వారు, డబుల్ ఓటర్లు, మైగ్రేషన్ వంటి ఓటర్లను తొలగిస్తూ తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు బీఎల్‌ఓలు సహకరించాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్‌ఐ మహేష్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, కిశోర్, వీఆర్ఏలు మల్లేష్, శివరామ్, వివిధ గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అమరచింత: ఓటరు జాబితాలో ఉన్న తప్పొప్పులను సవరించేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ రవికుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గోపాల్ బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రణభేరి మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

వనపర్తిటౌన్: ఎస్సీ వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో రణభేరి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణలో రోస్టర్‌పాయింట్లను సరిచేయాలని, అప్పటివరకు ఎలాంటి ఉద్యోగ నియమకాలు చేపట్టొద్దని డిమాండ్ చేశారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో మహాసభకు మాలలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రయువజన అధ్యక్షుడు సుధాకర్, రమేష్, రవి, విజయ్, నాగరాజు, శివ, వెంకటేష్, చిన్నదాస్ పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన డీలర్ నర్సింహకు మంజూరైన రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన ప్రజాశిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మెంటేపల్లిలో స్వచ్ఛభారత్

వనపర్తి రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా సేవాపక్షం స్వచ్ఛభారత్ బీజేపీ నాయకులు నిర్వహించారు. గురువారం మండల బీజేపీ అధ్యక్షుడు సందా వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మెంటేపల్లి గ్రామంలోని అంబేద్కర్ చౌక్, ప్రాథమికపాఠశాలల్లో పిచ్చిమొక్కలు తీసేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుమలయ్య, నాగేంద్రం, రాములు, దేవన్న, మాజీసర్పంచ్ నాగమ్మ, సరిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్య జీవితం

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగరాజు అన్నారు. ఫ్రైడే..డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మూడో వార్డులోని కాలనీల్లో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో దోమల నివారణ కోసం మందులను సిబ్బంది ద్వారా పిచికారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ యూసుఫ్, మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ పాల్గొన్నారు.



అమరచింతలో పారిశుద్ధ్యం పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పాన్‌గల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చునని వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా కేతేపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుమనశ్రీ, రాంచందర్, సతీష్, శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం..

పీహెచ్‌సీలో స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం ఉచిత వైద్యశిబికం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో చర్మ వ్యాధి నిపుణులు పాల్గొంటారని చర్మ వ్యాధులతో బాధపడే వారు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీపనగండ్ల: మండలంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, పలువురు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పాల్గొన్న కమిషనర్ శశిధర్

ఆత్మకూర్: చెత్తను ఆరుబయట పారబోస్తే జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయా వార్డులో అధికారులు, కార్మికులతో కలసి డ్రైడే ఫ్రైడేలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కమిషనర్, ఎంఈఓ బాలరాజులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. స్థానిక దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 120 ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.3వేలు జరిమానను విధించారు. అలాగే విచ్చలవిడిగా సంచరిస్తున్న వరాహాలను ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి తరలించారు.